క్లుప్తంగా

పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

చిన్నకోడూరు(సిద్దిపేట): పెద్దకోడూరులోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ విడుదల చేశామని ప్రిన్సిపాల్ స్నేహలత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ కళాశాలలో సివిల్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో మిగిలిన సీట్ల సర్దుబాటు కోసం 12న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఫీజు చెల్లించాలన్నారు.

అంకిత భావంతోనే గుర్తింపు



సన్మానిస్తున్న అదనపు డీసీపీ

చిన్నకోడూరు(సిద్దిపేట): విధి నిర్వహణలో ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని పెద్దకోడూరు శివారులోని సీఏఆర్ హెడ్ క్వార్టర్‌లో హోంగార్డు జీవన్‌రెడ్డి పదవీ విరమణ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ కాలం విధులు నిర్వహించిన పోలీస్ సిబ్బంది సేవలు మరువలేమన్నారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వర ప్రసాద్, ధరణి కుమార్, ఆర్ఎస్ఐ బాలకృష్ణ సిబ్బంది పాల్గొన్నారు.

సమయాన్ని వృథా చేయొద్దు



పుస్తకాలను అందజేస్తున్న బీఎస్ రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పోటీ పరీక్షల అభ్యర్థులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఎస్‌రావు ఫౌండేషన్ అధినేత బీఎస్ రావు సూచించారు. శనివారం జిల్లా గ్రంథాలయంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సంబంధించిన పాఠ్యపుస్తకాలను గ్రంథాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను గ్రంథాలయానికి అందించామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ ఏవీఎస్ రాజు, సిద్దిపేట బార్ కౌన్సిల్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, డాక్టర్ సతీశ్, సాయి, ముజఫర్, మల్లయ్య, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులు నింపండి



మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

బెజ్జంకి(సిద్దిపేట): కాళేశ్వరం జలాలతో చెరువులు, కుంటలను నింపాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. బెజ్జంకిలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులతోపాటు భూగర్భ జలాలు తగ్గనందున నీటిఎద్దడి రాకుండా చూడాలన్నారు. అలాగే రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు లక్ష్మణ్, తిరుపతి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజయ్య, తిరుపతిరెడ్డి, మల్లేశం నరేశ్, మోహన్, సుదర్శన్, శివకృష్ణ, నవీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదుకుంటున్న వైద్య శిబిరాలు



శిబిరంలో పాల్గొన్న సిబ్బంది

ములుగు(గజ్వేల్): పెద్ద ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకోలేని పేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఆదుకుంటున్నాయని కేబీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొన్యాల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని వాగునూతిలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలోను ఉచిత వైద్య సేవలందించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్, ట్రాక్టర్ పట్టివేత

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గాగిల్లాపూర్ కెనాల్ వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపుతోపాటు మోయతుమ్మెదవాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరను పట్టుకున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి శనివారం తెలిపారు. ఇసుక డంపును సీజ్‌చేసి ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

పొంచిఉన్న ప్రమాదాలు

- చేతికి అందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్‌లు
- వార్డుల్లో ఇనుప స్తంభాలు
- భయాందోళనలో ప్రజలు



తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్



15వ వార్డులో ఇనుప స్తంభాలు

రాష్ట్రంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా 24గంటలపాటు నిరంతర విద్యుత్ సరఫరాకు ఆ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రెండు, మూడు గ్రామాలకు ఒక్కటి చొప్పున విద్యుత్ ఉపకేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే లోవోల్టేజీ సమస్యలను తీర్చేందుకు కృషిచేస్తున్నారు. కాని పట్టణాలు, గ్రామాలలో చిన్నచిన్న సమస్యలను పరిష్కరించడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో ప్రజలు నిత్యం భయం గుప్పిటలో బతకాల్సి వస్తోంది.

– దుబ్బాకటౌన్

పట్టణంలో ఇనుప స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15వ వార్డులోని బాలికల వసతి గృహం నుంచి గాంధీ విగ్రహం వరకు, అలాగే 14వ వార్డులోని శాస్త్రి, తెలంగాణ తల్లి విగ్రహాల సమీపంలో ఉన్న ఇనుప స్తంభాలతో ప్రజలు భయాందోళనకు గురిచేస్తున్నాయి. వర్షాకాలం స్తంభాలకు విద్యుత్ సరఫరా రావడంతో షాక్‌కు గురవుతున్నారు. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని అధికారులు గతంలో 20వార్డులోని ఇనుప స్తంభాలను మార్చి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేశారు. కాని కొన్ని వార్డుల్లో ఇనుప స్తంభాలను అలాగే వదిలేశారు. వాటితో ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ సమస్యపై పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోననే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదరకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

పట్టణంలోని గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి విగ్రహాల వద్ద, అలాగే మండల పరిధిలోని మల్లాయపల్లి, చెర్వాపూర్, ధర్మాజీపేట, చెల్లాపూర్, రాజక్కపేట పొలాల వద్ద తక్కువ చేతికందే ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. దీంతో రైతులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే పశువులు మేతమేస్తూ వైర్లకు తాకి మృత్యువాత పడుతున్నాయని వాపోతున్నారు. ఈ సమస్యను తీర్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

అధికారుల కాలయాపన

ఇనుప స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లతో ప్రమాదాలు పొంచిఉన్నా అధికారులు కాలయాపన చేస్తున్నారే తప్ప వాటిని తొలగించి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు త్వరగా స్పందించి రైతులు, ప్రజలకు విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు.

షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది

ఇనుప స్తంభాలతో ప్రమాదం పొంచిఉంది. వర్షాకాలం కారణంగా ప్రజలు షాక్‌కు గురయ్యే అవకాశం ఉంది. పట్టణంలో ఉన్న ఇనుప స్తంభాలన్నింటినీ వెంటనే తొలగించాలి.



– మాదబోయిన శ్రీకాంత్, దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు

సమస్యలను పరిష్కరిస్తాం..

పట్టణంలో చాలా వరకు సిమెంట్ స్తంభాలను వేశాం. అక్కడక్కడా కొన్నిచోట్ల ఇంకా మిగిలి ఉన్నాయి. వాటిని కూడా త్వరలోనే తొలగిస్తాం. అక్కడక్కడ మిగిలిఉన్న మిగతా సమస్యలను కూడా త్వరలోనే పరిష్కరిస్తాం.



– పందరి, ఏడీఈ, దుబ్బాక

భవనానికి స్థలం కేటాయించండి



హుస్నాబాద్‌రూరల్: మంత్రిని కలిసిన ముదిరాజ్ నేతలు

- మంత్రి పొన్నంకు ముదిరాజ్ నేతల వినతి

హుస్నాబాద్‌రూరల్/నంగునూరు(సిద్దిపేట): హుస్నాబాద్ డివిజన్ కేంద్రంలో ముదిరాజ్ సంఘం భవనానికి ఐదెకరాల భూమిని కేటాయించాలని ఆ సంఘం నాయకులు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విన్నవించారు. నాయకులు పెండ్యాల అయిలయ్య, గీకురు రవీందర్, పొన్నబోయిన శ్రీనివాస్, కాశబోయిన రవి, బొల్లి శ్రీనివాస్ తదితరులు శనివారం మంత్రిని కలిసి మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో తాము ఎక్కువ సంఖ్యలో ఉన్నామని, సంఘం భవనం అలాగే చేపల మార్కెట్ కోసం స్థలం కేటాయించాలని మంత్రిని కోరామన్నారు. అలాగే హాస్టల్ భవనానికి నిధులు మంజూరు చేయించాలని అడిగినట్టు చెప్పారు. సంఘం భవనానికి నిధులు మంజూరు చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. సిద్దిపేటలో నెలకొల్పనున్న కొరివి కృష్ణస్వామి విగ్రహావిష్కరణకు ముదిరాజ్ వర్గీయులు అధిక సంఖ్యలో తరలిరావాలని సేవా సమితి జిల్లా ఇన్‌చార్జి శ్రవణ్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ప్రశాంత్ పిలుపునిచ్చారు. నంగునూరులో కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ధర్మ, రవి, రాజు, ప్రశాంత్, సుధాకర్, శ్రవణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

హుస్నాబాద్: భౌతిక, రసాయనశాస్త్ర ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా ఫోరం ప్రతినిధులు తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఫోరం ప్రతినిధులు మాట్లాడుతూ తమకు గణితం పీరియడ్లను కేటాయిస్తున్నారని వాపోయారు. దీని వల్ల ఐఐటీ, జేఈఈ, పాలిటెక్నిక్ పరీక్షల్లో విద్యార్థులు అర్హత సాధించలేకపోతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సాదత్ అలీ, నర్సింహారెడ్డి, వెంకట నారాయణ, చింతకింది శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, రాజమౌళి, మన్మోహన్ రెడ్డి, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యం

- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



విలేజ్ బ్యాగ్‌ను ప్రారంభిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): ప్లాస్టిక్ రహిత గ్రామాలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పిలుపునిచ్చారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 'ప్లాస్టిక్ రహిత భారత్ నిర్మాణం' కార్యక్రమంలో భాగంగా విలేజ్ బ్యాగ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం గ్రామాల్లో విలేజ్ బ్యాగులను ఏర్పాటు చేయడం ఎంతో ఉపయోగం అన్నారు. ప్లాస్టిక్‌కు బదులు నార, గుడ్డ సంచులను, పేపర్ కవర్లను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్, మండల నోడల్ అధికారి అంజాగౌడ్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, వీఓఏ మహిపాల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ గౌతమి, ఎర్త్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ ఆంజనేయులు, రాజు, నిహారిక, ప్రశాంత్, ఇమ్రాన్, విద్య, వాలంటీర్లు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

- సీఐ లతీఫ్



మొక్క నాటుతున్న సీఐ లతీఫ్

తొగుట(దుబ్బాక): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సీఐ లతీఫ్ పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. వృక్ష సంపద తగ్గిపోవడంతో సకాలంలో వర్షాలు కురవడం లేదని చెప్పారు. ఎస్ఐ రవి కాంతారావు, ఏఎస్ఐలు రాంరెడ్డి, యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించండి

దుబ్బాకటౌన్: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని కౌన్సిలర్ బత్తుల స్వామి అన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట 9వ వార్డులో ఇంటింటా మొక్కలను పంపిణీ చేశారు. కాలిపోయిన బోరు మోటారును తన సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించి నీటి కష్టాలను తీర్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పచ్చదనం కోసం 1200 మొక్కలు పంపిణీ చేశామన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ములుగు(గజ్వేల్): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని ఎస్ఐ విజయ్‌కుమార్ సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో సిబ్బందితో కలసి శనివారం ఆయన మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణకు అందరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

బెజ్జంకి(సిద్దిపేట): కల్లెపెల్లి గ్రామానికి చెందిన బొలిమల నాంపెల్లి(65) అనే వృద్ధుడు చికిత్స పొందుతూ కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఇటీవల నాంపెల్లికి మతిస్థిమితం సరిగాలేదు. దానికి తోడు కొన్ని రోజులుగా ఒంటి నొప్పులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం పురుగుల మందు తాగాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/చేర్యాల(సిద్దిపేట)/(హుస్నాబాద్): : మెదక్-ఎల్కతుర్తి నేషనల్ హైవే పనుల్లో భాగంగా ఎన్సాన్‌పల్లి చౌరస్తాలోని 33కేవీ, 11కేవీ లైన్‌ల మార్పు కారణంగా ఎన్సాన్‌పల్లి, ప్రభుత్వ మెడికల్ కళాశాల, డీఎక్స్ఎన్ కంపెనీ, మిట్టపల్లి, ఎల్లుపల్లి గ్రామాలలో ఆదివారం ఉదయం 10గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ నిలిపివేస్తామని రూరల్ సబ్ డివిజన్ ఏడీఈ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోగదారులు గమనించి సహకరించాలని కోరారు. చేర్యాల మండల పరిధిలోని ముస్త్యాల 132కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్లో మరమ్మతు పనులు జరుగుతున్న కారణంగా చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి, దూల్మిట్ట మండలాల్లోని గ్రామాల్లో ఆది, సోమవారాలు ఉదయం 6నుంచి సాయంత్రం 5వరకు త్రీ ఫేజ్ విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ రత్నాచారి తెలిపారు. మద్దూరు మండలంలోని అన్ని గ్రామాల్లో రెండు రోజుల పాటు ఉదయం 6గంటల నుంచి సాయంత్రం4 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుదని ఏఈ సు. దీర్ బాబు తెలిపారు. ముస్త్యాల సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ నిలిపివేస్తున్నట్టు చెప్పారు.

వేచరేణిలో పోలీసుల 'కనువిప్పు'

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వేచరేణిల కొమురవెల్లి పోలీసులు 'కనువిప్పు' కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ ఎల్.శ్రీను మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. బ్యాంకు అధికారులమని, రుణమాఫీ వచ్చిందని, కరెంట్ బిల్లు కట్టాలని, కేవైసీ అప్డేట్ చేయాలని వచ్చే కాల్స్, లింక్‌ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కి కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో కళా బృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారధి బృందం సభ్యులు శ్యాంసుందర్, కనకయ్య, హరిప్రసాద్, భిక్షపతి, కొమురవెల్లి ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు అధ్వానం



వట్టిపల్లిలో ధ్వంసమైన రోడ్డు

మండల పరిధిలోని వట్టిపల్లిలో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి. మట్టి రోడ్లన్నీ ధ్వంసమై గోతులు ఏర్పడ్డాయి. దీంతో ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారాయి. మూడు జిల్లాల సరిహద్దు గ్రామం కాబట్టి ప్రజలు నిత్యం ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు నిర్మాణానికి రూ.4కోట్లు మంజూరు చేసినా నేటికి పనులు ప్రారంభించలేదు.

– జగదేవ్‌పూర్(గజ్వేల్)

కర్రే ఆధారం..!



లూజ్ వైర్లకు ఆసరాగా పాతిన కర్రలు

కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలకు కర్రలే ఆధారాలయ్యాయి. విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచాయి. మండల పరిధిలోని గంగాపూర్ శివారులో పనులు చేసేటప్పుడు ప్రమాదాలకు గురికాకుండా రైతులు కర్రలను అమర్చారు. అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

– చిన్నకోడూరు(సిద్దిపేట)

వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడుదాం

సిద్దిపేటజోన్: పీవీ రావు పోరాట స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ మద్దెల నర్సింహులు శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఏకపక్షంగా తీర్మానంచేసి నాలుగేళ్ల దళితులను విడదీసి పాలిస్తే అది రాజ్యాంగ విరుద్ధమని పీవీ రావు సుప్రీంకోర్టుకు వెళ్లారని గుర్తు చేశారు. ఆ స్ఫూర్తితో మళ్లీ పోరాటం చేయాలని సూచించారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శ



మాట్లాడుతున్న హరీశ్‌రావు

సిద్దిపేటరూరల్: ఇటీవల నారాయణరావుపేట మండల కేంద్రంలో మృతి చెందిన పలు కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పరామర్శించారు. ఎవరూ అధైర్య పడొద్దని, అన్ని రకాలుగా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మాజీ సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ బాలకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ సంతోష్, మాజీ ఎంపీటీసీ హరీశ్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మృతుడి కుటుంబానికి సాయం

తొగుట(దుబ్బాక): మండలంలోని కాన్గల్ గ్రామానికి చెందిన బత్తుల కిష్టయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. దీంతో విషయం తెలుసుకున్న ఎంపీపీ మాజీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి 50కిలోల బియ్యాన్ని శనివారం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కర్నాకర్, పరశురాములు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ నేతకు పరామర్శ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ నాయకుడు రతన్ తల్లి అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు, తిగుల్ మాజీ సర్పంచ్ భానుప్రకాశ్‌రావు, నాయిని యాదగిరి, నర్సింహులు రతన్‌ను పరామర్శించారు. అనంతరం ఆర్థిక సహాయం అందించి భరోసా ఇచ్చారు.

◆ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం

కోహెడరూరల్(హుస్నాబాద్): బస్వాపూర్‌లోని శివభక్త మార్కండేయ యువజన సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా వేముల నరేశ్, ఉపాధ్యక్షుడుగా గాదాసు భాస్కర్, కోశాధికారిగా శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నరేశ్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

◆ పథకాలను సద్వినియోగం చేసుకోండి

దుబ్బాకటౌన్/తొగుట(దుబ్బాక): ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని దౌల్తాబాద్ మాజీ జెడ్పీటీసీ రణం జ్యోతిగౌడ్ సూచించారు. మండలంలోని చెట్ల నర్సింపల్లికి చెందిన నందిని ఇటీవల అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స చేయించుకొంది. దీంతో ఆమెకు సీఎం సహాయనిధి నుంచి రూ.35వేల మంజూరైంది. ఆ చెక్కును శనివారం నందిని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆమె వెంట జనార్దన్, సత్యం, స్వామి తదితరులున్నారు. అదేవిధంగా తొగుట మండల కేంద్రానికి చెందిన కాసర్ల లింగం కుటుంబానికి మంజూరైన రూ.60వేలు సీఎం సహాయనిధి చెక్కును బీజేపీ జిల్లా నాయకుడు పాగాల బాల్‌రెడ్డి అందజేశారు. ఆయన వెంట రాజిరెడ్డి, దుర్గాప్రసాద్, మైసయ్య ఉన్నారు.

◆ స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

మద్దూరు(హుస్నాబాద్): కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతి నాయకుడు, కార్యకర్త త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషిచేయాలని చేర్యాల మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కామిడి జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని రేబర్తి గ్రామంలో మండల అధ్యక్షుడు మేక మల్లేశం అధ్యక్షతన శనివారం నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సుదర్శన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మల్లేశం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

◆ ఘనంగా కనకదుర్గ విగ్రహ ప్రతిష్ఠాపన

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని పుల్లూరులో జరుగుతున్న కనకదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠాపనలో బీఆర్ఎస్‌పార్టీ మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్‌రావు పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను ఆలయ కమిటీ, మున్నూరు కాపు సంఘం సభ్యులు సన్మానించారు.

◆ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడిగా రాజేశ్

మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి అంబేడ్కర్ సంఘం(మాల) కమిటీ అధ్యక్షుడిగా మద్దెల రాజేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడుగా ధార స్వామి, ర్యాకం పెద్దబాబు, ప్రధాన కార్యదర్శిగా అస్క స్వామి, సంయుక్త కార్యదర్శులుగా పొడేటి భిక్షపతి, మద్దెల రాజయ్య తదితరులు ఎంపికయ్యారు.

◆ పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

బెజ్జంకి(సిద్దిపేట): పద్మశాలీలు రాజకీయంగాను ఎదగాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు కస్తూరి సతీశ్‌కుమార్ సూచించారు. పద్మశాలి సంఘంలో రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం పోటీచేస్తున్న బూర మల్లేశంను గెలిపించాలని కోరుతూ బెజ్జంకి సంఘ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో భిక్షపతి, పురేందర్, మచ్చ శేఖర్, సూర్యప్రకాశ్, జయరాములు, సత్యనారాయణ, రవీందర్, మల్లేశం, సత్యం, శ్రీపతి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

◆ లూత్రను కలిసిన దళిత సంఘాల నాయకులు

సిద్దిపేటజోన్: సుప్రీంకోర్టు అడ్వకేట్ సిద్ధార్థ లూత్రను శనివారం దళిత సంఘాల నాయకులు ఢిల్లీలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్, పాపయ్య శనివారం వివరాలు వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టులో వాదించడానికి రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ న్యాయవాది లూత్రను నియామకం చేసిందన్నారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేసినట్లు వారు పేర్కొన్నారు.

◆ రాష్ట్ర సంయుక్త కార్యదర్శికి సన్మానం

సిద్దిపేటజోన్: తెలంగాణ రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌ను శనివారం హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు.